
# ఫోన్ మోగింది

సూరిపండు




ఉదయాన్నే పేపరు పఠనానికి ఉపక్రమించాడు మధుసూదనం. ఆరోజు ఆదివారం. ఏ వ్యాపకాలు లేకపోవడం. తీరిగ్గా పేపరుతో కుస్తీపట్టాల నుకోవడం అతనికి సరదా. అలా పేపరు చేతిలోకి తీసుకుని ఇలా సోఫాలో కూర్చున్నాడో లేదో బల్లమీది ఫోన్ మ్రోగింది. ట్రింగ్... ట్రింగ్ మంటూ దీని దుంపతెగ. ఇదొకటి పానకంలో పుడకలాగా... లేచివెళ్ళి ఫోన్ తీసి "హలో" అన్నాడు. "నమస్తే సార్. పేపరు పఠనంలో ముద్రారాక్షసంలా అడ్డొచ్చాననుకోకుండా కొంచెం మీ ఇంటి ఎదురుగా వున్న రామభద్రం గార్ని పిలుస్తారా... అంటూ ఎంతో నమ్రతగా వినిపించింది. ఫోన్‌లో గొంతు"వార్ని నేను పేపరు చదువుతున్నట్టు వీడికెలా తెల్సిందబ్బా..." అని ఆశ్చర్యార్థక ముఖ కవళికలతో "అలాగే... అలాగే..." అంటూ ఫోన్ పక్కన పెట్టి అటూఇటూ చూశాడు. ఎవరైనా కన్పిస్తారేమోనని. ఎవరూ కన్పడకపోవడంతో "ఎదురిల్లే కదా" అనుకుంటూ తనేవెళ్ళాడు మధుసూదనం. తలుపులు వేసివుండడంతో " ఏమండీ...

ఏమండీ..." అంటూ పిల్చాడు. ఎవరూ పలకకపోవడంతో మరోసారి గట్టిగా పిల్చాడు. "ఏమండీ... ఏమండీ..." అంటూ. "అబ్బబ్బ అడుక్కోవ డానికి అప్పుడే తెల్లారిందీ... అలాపోవోయ్" అంటూ లోపల్నించి విన్పడ్డాయి మాటలు. గతుక్కుమన్నాడు మధుసూదనం. " ఇదేం ఖర్మంరా బాబూ..." అనుకొని "అయ్యా రామభద్రంగారూ... రామభద్రంగారూ " అంటూ పేరు పెట్టి పిలిచాడు." ఓరి వీడి మొహం తగలెయ్యా! . పేరుపెట్టి పిల్చి మరీ అడుక్కుంటున్నాడు. ఉండు నీపని చెప్తా " అన్న మాటల్తో తలుపు తీస్తున్న శబ్దం వినిపించింది. ఆ మాటలని విని మరింత ఖంగారుపడి " నేనండీ... మీ ఎదురింటి మధుసూదనాన్ని. మీకు ఫోన్ వచ్చింది" అన్నాడు మధుసూదనం. " అయ్యో... అయ్యో... మీరా మధుబాబుగారూ! ఎవడో అడుక్కునే వెధవేమో అనుకుని అలా అనేశాను. ఏమనుకోకండీ... "పరుగు పరుగున బయటికి వచ్చి మధుసూదనం రెండు చేతులూ పట్టుకున్నాడు రామభద్రం." సరే సరే పర్లేదు. మీరు వెళ్ళి ఫోన్ మాట్లాడండి. అన్నాడు మెల్లగా మధుసూధనం. అతని వెనుకాలే ఇంట్లోకి తనూ వెళ్ళాడు. రామభద్రం ఫోను మాట్లాడుతుండగా తను పేపరు తెరిచాడు. ఓ పావు గంట ఫోన్లో రకరకాల అభినయాలతో మాట్లాడి వెళ్ళిపోయాడు రామభద్రం. అతగాడు ఇలా వెళ్ళాడో లేదో మళ్ళీ మ్రోగింది ఫోను. లేచి వెళ్ళి ఫోన్ తీసాడు మధుసూధనం. "హలో" అనగానే "నమస్తే అంకుల్! కొంచెం మీ ప్రక్కింటి రాంబాబుని పిలుస్తారా అంకుల్" డీసెంట్‌గా రిక్వెస్ట్ చేసింది ఓ ఆడపిల్ల గొంతు." కొంచెమేమిటమ్మా పూర్తిగానే పిలుస్తాను." ఓ వెర్రి నవ్వు నవ్వి అన్నాడు మధుసూధనం.ఫోన్ ప్రక్కన పెట్టి బయటకు వెళ్ళాడు. ఆ ఫోన్ కాల్ కోసమే ఎదురు చూస్తున్నట్టు వరండాలో కాలు కాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నాడు రాంబాబు. మధుసూధనాన్ని చూడగానే "ఫోనొచ్చిందా అంకుల్" అంటూ ఆతృతగా అడిగాడు. "అవు నోయ్.."అనడం తడవుగా పరుగులాంటి నడకతో గేటువైపు ఉరికాడు రాంబాబు. "ఓరి వీడి ఆత్రం కాలిపోనూ! గోడ కాస్త ఎత్తులో ఉండిపోయింది. లేకపోతే గోడ మీద నుంచి జంప్ చేసేవాడేమో!" అనుకుంటూ లోపలికి వెళ్ళాడు మధుసూధనం. సోఫాలో కూలబడి పేపరు చేతిలోకి తీసుకున్నాడు. అవతల నుండి ఫోన్‌లో ఆ అమ్మాయి ఏం మాట్లాడుతుందో మరి. ఇవతల వీడు మాత్రం నలికల పాములా మెలికలు తిరిగిపోతూ అరగంట పైనే మాట్లాడాడు రాంబాబు. వాడల్లా వెళ్ళాడో లేదో ఫోను మ్రోగింది మళ్ళీ. చిరుగ్గా చూశాడు ఫోన్‌వంక మధుసూధనం పేపర్లోంచి తల బయటకు పెట్టి ."ఒక్కళ్ళైనా వచ్చి చావరేం ఫోను మ్రోగుతుంటే. ఏమై పోయారు కొంపలో జనాలందరూ.." విసుక్కుంటూ లేచి వెళ్ళి ఫోన్ తీశాడు. " హలో.. ఎవరు కావాలండీ." విసుగును కప్పి పుచ్చుకుంటూ అడిగాడు. " సూదన్నా.. కొంచెం అంకినీడన్నని పిలుస్తావా అన్నా."అంది అవతలి గొంతు. "అంకినీడా.. ఆయనెవరు తమ్ముడూ" కాస్త వ్యంగ్యంగా అన్నాడు. "ఏందన్నో.. హాస్యమా ఏంది. అంకినీడన్న తెల్వదా."తెలియకనే కదయ్యా బాబూ.. ఎవరని అడిగేది". "అదేందన్నా అంకినీడన్న తెల్వదా.మీ వార్డు కౌన్సిలరుగా పోటీ చేసి ఓడి పోయాడే మీ అందరి సలవ్వల్ల. ఆయన!" వివరంగా చెప్పింది అవతలి గొంతు. "నాక్కాస్త రాజకీయ పరిజ్ఞానం తక్కువలే. ఇంతకీ ఆ ఓ.కే. గారెక్క డుంటారో చెప్పు బాబూ పిలుస్తా. "ఏందన్నో" ఓ.కే.

**ఆచార్య వినోబా భావే జయంతి**

సెప్టెంబర్ 11, 1895న వినోబా నరహరిభావే మహారాష్ట్రలోని కొలాబా జిల్లా గగోరీ గ్రామంలో జన్మించారు. 1916లో గాంధీజీ శిష్యులైన తర్వాత సబర్మతీ ఆశ్రమంలో ఉపాధ్యాయులుగా ఉండటం వలన అందరూ 'ఆచార్య' అని పిలిచేవారు. 1951లో పాదయాత్ర చేస్తూ ఢిల్లీ నుండి హైదరాబాదు చేరారు. భూదానోద్యమం ఈయనతోనే ప్రారంభ మైంది. గోవధ నిషేధానికి కృషి చేశారు. 'మహారాష్ట్ర ధర్మ పత్రిక' అనే మాస పత్రికను నడిపారు. మరణానంతరం వీరికి 'భారతరత్న' (1983) పురస్కారం ప్రకటించబడింది.

గారంటున్నావ్. ఆయనెవుడు.. "ప్రశ్నార్థకం పెట్టింది ఫోన్‌లో గొంతు. అదేనయ్యా ఓడిపోయిన కౌన్సిలర్‌గారు.."మరోసారి వ్యగ్యం ధ్వనించింది మధుసూధనం గొంతులో." అన్నో! కాస్త మరియాదియ్యరాదే! ఈ సారి గెల్వకపోతాడా. అన్న మా వార్డు కౌన్సిలర్ గాకపోతాడా. మరీ అంత సీఫ్‌గా మాట్లాడకన్నా!" అన్నాడు అవతలి వ్యక్తి. "ప్రొద్దుటే వీడితో వాదనేంటిరా బాబూ" "అనుకుంటూ" సరేనయ్యా ఈసారి నా ఓటు తప్పకుండా అంకినీడు అన్నకే వేస్తాను. ఇంతకీ అన్న ఎక్కడుంటాడో చెప్పనేలేదు. " మర్యాద ఉట్టి పడుతుండగా మాటల్లో అన్నాడు మధుసూధనం" థ్యాంక్స్ అన్నా. మా అన్న ఎలక్సన్‌లో గెలిసినంత హేపీగా ఉంది. అదే అన్నా మీ ఇంటికి నాలుగిళ్ళవతల పెద్దపెద్ద కటకటాల లోగిలి. కాస్త వేగిరం పిలువన్నా... ఫోన్ పక్కన పెట్టి అంకినీడు కోసం పరుగులు పెట్టాడు మధుసూధనం. ఆనక ఆ అంకినీడు రావడం ఓ అరగంట పిచ్చాపాటీ మాట్లాడి మరో అరగంట రాజకీయాలగురించి మాట్లాడి ఫోన్ పెట్టేశాడు పోతూ పోతూ పేపర్లో దూరిపోయి వున్న మధుసూధనాన్ని పలకరించాడు. " థ్యాంక్సన్నా నీకేవన్నా మున్సిపాల్టీలో అవసరం పడితే నాకుజెప్పన్న. సిటికెలో జేయించేస్తా. వస్తా అన్నా. "అంటూ జవాబు కోసం చూడకుండా వెళ్ళిపోయాడు అంకినీడు. హామ్మయ్య ఈ ఫోన్‌లేంటిరా బాబూ... ఊపిరిపీల్చుకోవడానికి కూడా టైం లేకుండా..." నిట్టూరుస్తూ గాఢంగా పేపరు అందుకోబోయాడు మధుసూధనం. యధాప్రకారం మళ్ళీ ఫోన్‌మ్రోగింది. "ఛ. వెధవ ఫోను. దీనికేం పనున్నట్టులేదు. నేరకపోయి పెట్టించాను. "అంటూ చిరాగ్గా చేతిలో ఉన్న పేపర్ని టీపాయ్ మీదకి గిరవాటు పెట్టాడు."ఎక్కడ చచ్చారర్రా జనాలందరూ ప్రొద్దుటినుంచీ విడవకుండా చంపుకు తింటుంటే ట్రింగు... ట్రింగు...మని. ఒక్కళ్ళకీ విన్పించిచావడంలేదా. లేకపోతే వాడిచావు వాడే ఛస్తాళ్ళే. హాల్లో పడేదుస్తున్నాడు కదా అని నిర్లక్ష్యమా! అంటూ పిచ్చెక్కినవాడిలా అరవడం మొదలు పెట్టాడు. కల్లు తాగిన కోతిలా... నిప్పుతొక్కిన కోతిలా... తేలు కుట్టిన కోతిలా...అరుపులే అరుపులు. ఆ అరుపులకి బిలబిలమంటూ వచ్చారు. లోపల్నుంచి "ఏమయ్యిందండీ..." అంటూ అతగాడి భార్య. "ఎందుకు నాన్న..." అంటూ కూతురు. "అదేమిటిరా నాన్నా... అలా అరుస్తావ్..." ముసలితల్లి. "వాట్ డాడీ!" కొడుకు. ఫోన్ మాత్రం తనపని తను చేసుకుపోతూనే ఉంది. "ఏమయ్యిందా... ఎందుకా. నా శ్రార్ధం అయింది. అందుకు నేనుకాదే అరుస్తోంట అదీ ప్రొద్దుటినుంచీ ఏకధాటిగా! ప్రశాంతంగా పేపరు చదువుకుందామంటే లేదుకదా. ఏదో... వీళ్ళందరికోసమూ నేను ఫోను పెట్టుకున్నట్టు ప్రతీ అడ్డగాడిద ఫోన్ చెయ్యటమే. వాళ్ళని కేకెయ్యండి వీళ్ళని కేకెయ్యండి అంటూ.ఛ ఛ ఛ! ఆదివారం అన్న సంతోషం కూడా లేకుండా పోయింది!" అందరిమీద ఒకేసారి విరుచుకువడ్డాడు మధుసూధనం.

నవ్వుతూ ముందుకు వచ్చింది మధుసూధనం భార్య మహాలక్ష్మి. "నవ్వుతావు. నీకేం!నువ్వు బాగానే నవ్వుతావు. ఆ ఫోన్ తీసి సమాధానాలు చెప్తూ, అడ్డమైన వెధవ వాగుళ్ళు విని, వాళ్ళని పిలిస్తే తెలుస్తుంది నీకు నాబాధేమిటో!" భార్య మీద గయ్యమన్నాడు మధుసూధనం. "బలే వారండీ మీరు! మరి ఆ మధ్య మీ బాస్ ఫోన్ చేస్తే చెప్పలేదని రామాచారి మీద... అదే పక్కింటాయన... ఎంతలా కోప్పడిపోయారో. గుర్తుతెచ్చుకోండి. ఏం... వీడి బాబు సొమ్మేదన్నా పోతుందా! ఫోన్ వచ్చిందని చెప్తే వీడి నోటి ముత్యాలేమన్నా రాలిపోతాయా! తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు ఆఫీసరు వెధవ. ఆ రామాచారి గాడు చెప్పలేదు మొర్రో అంటే " అలాంటి వాడి ఫోన్ నెంబర్ ఎందుకిచ్చావోయ్" అంటూ మరో తట్టవరస తిట్లుతినిపించాడు. ఆ రామాచారిగాడికేమీ అవసరాలు రావా... ఎవరి సాయాలూ అక్కర్లేదా... పక్కింటి వాళ్ళం. ఆమాత్రం హెల్పింగ్ నేచర్ లేకపోతే ఎలాగ.ఆ పాటి ఫోన్ నేను పెట్టించుకోలేననా!" అంటూ ఎగిరెగిరి పడ్డారు.మర్చిపోయారా బాసూ! మీకు ఒక్క ఫోన్ కావచ్చు. ఆ రామాచారిగార్కి ఎన్ని ఫోన్లు వచ్చి చిరాకనిపిస్తే చెప్పలేదో. అని ఆరోజు ఆలోచించారా. అంతే స్వామీ... ఎవరికైనా అంతే!తనదాకా వస్తేనే కానీ తెల్సిరాదు మరి!" భార్య మాటలకు ఏం చెప్పాలో తెలీక నోరు తెరిచి... గుడ్లుతేలేశాడు మధుసూధనం. బల్లమీద ఫోను మ్రోగుతూనేవుంది.